# ఆత్మ తృప్తి



**ఎస్.డి.వి.అజీజ్**

*(గత సంచిక తరువాయి)*

కర్టెన్ పక్కకు తోసి గది లోపలికి అడుగు పెట్టాను. మధులత బెడ్‌పై పడుకొని నిద్రపోతూ వుంది. నా గుండె నెమ్మదించింది. అసలేం జరిగిందో ఆమె పనిచేస్తున్న సంస్థవారు చెప్పలేదు. హాస్పిటల్‌కొచ్చాక, "మధులత అనే అమ్మాయిని ఎక్కడ జాయిన్ చేశారు?" అని అడిగానే కాని, ఆమెకు ఏం జరిగిందో అడగలేదు. విషయం మధులతనే అడుగుదామనిపించింది. నిద్రలో వుంది. డిస్టర్బ్ చేయటం దేనికని, గది బయటికి వచ్చి, నేరుగా ఆ హాస్పిటల్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ దగ్గరికే వెళ్ళాను. నన్ను నేను పరిచయం చేసుకొని మధులత గురించి అడిగాను. అతన్నుంచి సమాధానం ఇలా వచ్చింది.

"ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించింది. హెవీ డోస్‌లో నిద్ర మాత్రలు మింగింది. సమయానికి ఆమె స్టాఫ్ ఇక్కడికి తెచ్చారు కాబట్టి లైఫ్ సేవ్ అయ్యింది. లేకుంటే చాలా ఇబ్బందిగానే వుండేది" మధులత ఆత్మహత్యకు ప్రయత్నించ దమా? నమ్మబుద్ధి కాలేదు. "అసలు ఏం జరిగింది డాక్టర్?" ఆరాటంగా అడిగాను.

"నాకు తెలిసిన సమాచారం ప్రకారం, ఆ అమ్మాయి ఎవర్నో ప్రేమించిందట. అతనూ ఈమె ప్రేమను యాక్సెప్ట్ చేశాట్ట. ఇద్దరూ కలిసి తిరిగేవారట. మరి ఆ తర్వాత ఏం జరిగిందో ఏమో తెలియదు. ఆమె నిద్ర మాత్రలు మింగి అపార్ట్‌మెంట్‌లో పడిపోయి వుంటే, ఆమె డ్యూటీకి రాకపోయేసరికి, కొలీగ్స్ ఆమెతో అవసరం వచ్చి, అపార్ట్‌మెంట్‌కు ఫోన్ చేశారట. ఎంతసేపు చేసినా ఫోన్ రింగ్ అవుతూనే వుంది కానీ, ఎవరూ లిఫ్ట్ చెయ్యలేదట. ఎక్కడికైనా వెళ్ళిందేమో అని మొదట అనుకున్నారట. అలా వెళితే ఆఫీసుకు ఫోన్‌చేసి చెప్పేదిగా. మరి చెప్పలేదంటే ఎందుకో అను మానం వేసి, ఓ ఇద్దరు కొలీగ్స్ వెహికిల్ తీసుకొని ఆమె వుంటున్న అపార్ట్‌మెంట్‌కెళ్ళారట. తలుపుకు బయట తాళం వేసి లేదట. ఎంత తలుపు తట్టినా బదులు లేదట. ఆ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌ను పిలిచి అడిగారట "మధులత బయటికి వెళ్లిందా?" అని.

"ఆ అమ్మ నిన్న రాత్రి పొద్దుపోయి వచ్చింది. అప్పట్నుంచి ఇప్పటిదాకా బయటికే పోలేదు. పోయేటప్పుడు నన్ను పలకరించే పోయేది. మరి ఇంకా బయటికి రాలేదు ఎందుకో" అన్నాడట. మధులత తప్పకుండా ఏదో అఘాయిత్యానికి పాల్పడి వుంటుందని భావించి, ఆ అపార్ట్‌మెంట్ వాళ్ళకు విషయం చెప్పి, తలుపు బద్దలుకొట్టించారు. లోపలికి వెళ్ళి చూస్తే నిద్ర మాత్రల మత్తులో మధులత బెడ్‌పై పడి వుండట. బెడ్ పక్కన కింద కొన్ని మాత్రలు పడి వున్నాయట. పక్కన టీపాయ్‌పై రాసివున్న కాగితంలో "నా చావుకు ఎవరూ బాధ్యులు కారు" అని రాసి సంతకం చేసి వుందట. వెంటనే ఆమెను ఇక్కడికి తెచ్చారు. మేము కూడా హోప్‌లెస్ అనుకున్నాము. బట్ లక్కీగా రెండ్రోజుల తర్వాత స్పృహలోకి వచ్చింది" అంటూ జరిగింది చెప్పాడు ఇన్‌ఛార్జ్ డాక్టర్.

"ఆమె గాఢ నిద్రలో ఉందా? లేక మత్తుమందిచ్చారా?" అడిగాను డాక్టర్‌ను. ఆమెకిచ్చిన టాబ్లెట్స్ లోనే కొద్దిపాటి మోతాదులో నిద్రను తెప్పించే గుణం వుంటుంది. మీరు వెళ్ళి మాట్లాడొచ్చు" అని చెప్పినా కూడా ఎందుకో డిస్టర్బ్ చేయాలనిపించలేదు.

హాస్పిటల్ బయటకొచ్చి పళ్ళు కొనుక్కొని, ఎదురుగా వున్న హోటల్లో ఓ ఛాయ్ తాగి, ఓ సిగరెట్ కాల్చాను. నాలో ఏర్పడ్డ టెన్షన్ తగ్గిపోయింది. తిరిగి హాస్పిటల్‌లోకి వెళ్ళి, మధులత గదిని చేరుకున్నాను. కర్టెన్ తొలగించి లోపలికి అడుగుపెట్టాను. నిదుర నుంచి మెలకువ వచ్చినా, కళ్ళు మూసుకొని అలాగే వుందేమోనని చిన్నగా దగ్గాను. నా ఊహే నిజమయింది. నా దగ్గు శబ్దం విని మధులత కళ్ళు తెరచి చూసింది. చిన్నగా నవ్వాను. మధులత కళ్లలో కన్నీరు. అమాంతంగా బెడ్ దిగి వచ్చి నన్ను కౌగలించుకొని ఏడ్చేసింది. ఎందుకో నాకు వీపింగ్ సెన్‌సేషన్ వచ్చేసింది. అయినా బలవంతంగా నిగ్రహించుకున్నాను. చిన్నగా వీపుపై తట్టి, నా నుంచి విడదీసి బెడ్‌పై కూర్చోబెట్టాను. ఆమె కళ్ళ నీళ్ళను తుడిచాను. కాసేపు నా వంకే చూస్తూండిపోయింది మధులత.

"నీ కళ్ళలో నుంచి కన్నీరు రారాదు నేస్తం.." అని చెప్పాలనిపించింది. అలా చెప్పలేకపోయాను. "ఎలా వుంది?" అని మాత్రం అడిగాను. సమాధానంగా చిన్నగా తలూపింది మధులత.

"మీ పేరెంట్స్ రాలేదా?" అడిగాను.

"ఇన్‌ఫాం చేశారట. వాళ్ళు ఏవో యాత్రలకు వెళ్ళారట. ఇంట్లో వున్న పనిమనిషి ఫోన్ ఎత్తి చెప్పిందట. ఆమెతో విషయం ఏమీ చెప్పలేదని కొలీగ్స్ అన్నారు. వారికి తెలియకపోవడమే మంచిదయ్యింది. నీ వర్క్ పూర్తయిందా?" అడిగింది మధులత.

"పూర్తయ్యింది"

"డ్రింక్ చేస్తున్నావా?"

"ఈ ఆర్నెల్ల నుంచి డ్రింక్ ముట్టలేదు. ఇక భవిష్యత్తులో కూడా ముట్టదలచుకోలేదు."

"నా కోరిక మేర డ్రింక్ మానేసినందుకు థాంక్స్"

"ఆ థాంక్స్ ఏదో నేనే చెప్పుకోవాలి"

"ఆమె గుర్తొస్తూ వుందా?"

"ఆమె గుర్తొస్తూ వుంటుంది. నాలో నేను నవ్వేసుకుంటూ వుంటాను. ఆమె జ్ఞాపకాల్ని మనసు మూలలో భద్రపరిచాను. గతంలోలాగ ఇప్పుడు బాధలేదు. కాకపోతే, అప్పుడప్పుడూ ఏదో తెలియని ఫీలింగ్. అది కొన్ని క్షణాలపాటే" చెప్పాను.

"నేను నీ కంటికి పిరికిదానిలా అగుపిస్తూ వున్నాను కదూ! ఆ రోజు లవ్ అంటే నథింగ్ బట్ జస్ట్ ఎట్రాక్షన్..అన్న నేనే ఈ పరిస్థితికొచ్చినందుకు నీకు మనసులో నవ్వులాటగా వుంది కదూ?"

"అలాంటిదేం లేదు" చిన్నగా తల అడ్డంగా ఆడించాను.

"మనిషి ఏ విషయమైనా అనుభవానికి రాక ముందు, ఆ విషయం గురించి ఎన్నయినా చెబుతాడు. తీరా అనుభవానికొస్తేనే తెలుస్తుంది. ఆ విషయం తాలూకు బాధ ఎలాంటిదో. కడుపు నొప్పి వున్నవాడికే, ఆ బాధ ఎలాంటిదో తెలుస్తుంది అన్నట్టుగా! నేను ఆనాడు నీతో అన్నాను. ప్రేమలో ఊహించుకుంటే గొప్పతన ముంది. లేకుంటే ఏమీ లేదని. కానీ నాకు అనుభవానికి వచ్చాక తెలిసింది. మనం ఊహించుకున్నా ఊహించుకోకపోయినా, ప్రేమలో ఏదో తెలియని ఓ బలవత్తరమైన శక్తి వుంది. మెటిరిస్ట్ దృష్టితో చూసేవారికి ఈ శక్తి మెంటల్ ఇమ్‌బ్యాలెన్స్‌గా బాడీలో జరిగే కెమికల్ రియాక్షన్ అనిపించవచ్చు. మనిషి ఎప్పుడూ ప్రతిదీ మెటిరిస్ట్ దృక్పథంతోనే ఆలోచించలేడు. చాలామార్లు మనసు స్పందనకే ప్రాధాన్యతనివ్వాల్సి వస్తుంది. అప్పుడు మెటిరిస్ట్ దృక్పథం అన్నది ఏమాత్రం పనిచేయదు. మనసు ప్రేరేపించే ఉద్వేగాలకు లోనవక తప్పదు. నేనూ అలా లోనయ్యే, ఈ అటెమ్ట్ చేశాను" అంది మధులత.

"అలాగని ఏం లేదు. ప్రతి మనిషికీ జీవితంలో చాలా సందర్భాల్లో ఏదో ఒక సమస్య మూలంగా, ఎందుకీ జీవితం చావటం మేలు అనిపిస్తుంది. ఆమె నా ప్రేమను తిరస్కరించినప్పుడు కూడా ఇలాగే అనిపించింది. నువ్వన్నట్లుగా మనసు ఉప్పెనలా ఉద్వేగాన్ని ప్రేరేపించి, నిజంగా ఇలాంటి పనికి పురిగొల్పుతుంది. ఉప్పెనగా మారిన ఉద్వేగాన్ని ఎలాగో ఓలాగ ఆ సమయంలో కాస్త కంట్రోల్ చేసుకోగలిగితే, ఉప్పెన తగ్గిపోతుంది. ఉద్వేగం ఆగిపోతుంది. మస్తిష్కం మనసు స్వాధీనంలో నుంచి తిరిగి తన స్వాధీనంలోకి వస్తుంది."

నా ఎనలైజింగ్‌కు మధులతకు నవ్వొచ్చిందేమో పెదాలపై సన్నగా నవ్వు. నేను అడక్కుండానే జరిగింది ఇలా చెప్పుకొచ్చింది మధులత.

"నువ్వు వర్క్ బిజీలో పడ్డాక, కొన్నాళ్ళకు ఓ వ్యక్తి నాకు తారసపడ్డాడు. అతన్ని చూడగానే, ఎందుకో నాలో ఏదో తెలియని ఫీలింగ్. రోజూ మా ఆఫీసుకు వెళ్ళే దారిలో తారసపడేవాడు. అతన్ని చూడగానే మనసుకు ఎందుకో ఆనందం వేసేది. ఎలాగైనా అతనితో మాట్లాడాలి అనిపించింది. పరిచయం చేసుకోవాలి అనిపించింది. ఓ రోజు అనుకోకుండా లంచ్ కోసం రెస్టారెంట్‌కెళ్ళాను. అక్కడతను వున్నాడు. అతన్ని చూడగానే చాలా హేపీగా ఫీలయ్యాను. ఇదే మంచి అవకాశమనిపించి వెళ్ళి అతని ఎదురుగా కూర్చున్నాను. లంచ్ అయ్యేవరకూ అతనితో మాట్లాడలేదు. లంచ్ పూర్తయ్యాక, వెయిటర్ తెచ్చిన బిల్ పే చేయడానికి అతను, పర్సులో నుంచి వెయ్యి రూపాయల నోటు తీసిచ్చాడు. నేను నా బిల్ పే చేసేందుకు ఓ వంద ఇచ్చాను. ఛేంజ్ కోసం వెయిట్ చేస్తుండగా, వెయిటర్ వచ్చి, నాకు రావల్సిన ఛేంజ్ ఇచ్చాడు. అతను ఇచ్చిన వెయ్యి రూపాయల నోటును వెనక్కు ఇస్తూ చెప్పాడు –

"ఈ నోటు మంచిదో, నకిలీదో అని మా మేనేజర్ డౌట్ ఎక్స్‌ప్రెస్ చేస్తున్నాడు. అయిదొందలు, వెయ్యి రూపాయల నోట్లు మంచివో, నకిలీవో పరీక్షించే మిషన్ చెడిపోయిందట. కాబట్టి, మీ వెయ్యి మీరు వెనక్కు తీసుకొని 70 రూపాయలకు బిల్ ఇవ్వండి" అంటూ చెప్పాడు.

"నా దగ్గరున్నది ఈ నోటు ఒక్కటేనయ్యా! ఇది మంచి నోటే" చెప్పాడతను.

"కావచ్చు. కానీ మా మేనేజర్ తీస్కోవటం లేదు. మీరు తిన్నదానికి సరిపడ డబ్బు ఇవ్వాల్సిన బాధ్యత మీదే" చెప్పాడు వెయిటర్.

"కావచ్చు. కానీ నా దగ్గరున్నది ఈ నోటు ఒక్కటేనయ్యా. ఇది మంచి నోటే" మళ్ళీ చెప్పాడతను.

"వాదన వద్దు సార్. అవతల కస్టమర్స్‌కు సర్వే చెయ్యాలి. త్వరగా బిల్ పే చెయ్యండి" అతను ఏం చెయ్యాలో తోచక తల పట్టుకొని కూర్చున్నాడు.

నాకు మొదట్లో కాస్త నవ్వొచ్చినా, రేపు ఉదయం నాకిలాంటి పరిస్థితి వస్తే, ఇంతేకదా! అనిపించింది. వెయిటర్‌తో చెప్పాను "అతని బిల్ నేను పే చేస్తానని. అతను నా వంక కృతజ్ఞతా పూర్వకంగా చూస్తూ చెప్పాడు.

"థాంక్యూ మేడం. బయటికి వెళ్ళాక, ఎలాగైనా ఛేంజ్ తీసుకొని మీ డబ్బు మీకిచ్చేస్తాను."

"ఇట్స్ ఓకే" అని అతని బిల్ చెల్లించాను.

రెస్టారెంట్ నుంచి బయటికి వచ్చాక, అతని గురించి వివరాలు అడిగాను. తానో యాడ్ ఫిల్మ్ డైరెక్టర్‌నని చెప్పాడు. తన విజిటింగ్ కార్డు ఇచ్చాడు.

"మీరు చాలామంది కంటే అందంగా వున్నారు. యాడ్ ఫిల్మ్‌లో యాక్ట్ చేయకూడదా? మీరు ఓకే. అంటే నేను అవకాశం కలిగిస్తాను" చెప్పాడతను.

"నాకు ఇంట్రెస్ట్ లేదు" అని చెప్పాను.

"జస్ట్ ఎ మినిట్ ఛేంజ్ ఇస్తాను" అని పక్కన వున్న సిగరెట్ షాప్ దగ్గరకు వెళ్ళాడు. షాపువాడు ఆ నోటు చూసి భయపడ్డాడో ఏమో, "ఛేంజ్ లేదని" చెప్పాడట.

"మీ విజిటింగ్ కార్డ్ ఇవ్వండి. రేపు మీకివ్వాల్సిన డబ్బు తెచ్చిస్తాను. లేదంటే మీరు కాసేపు 'వెయిట్‌చేస్తానంటే ఇప్పుడు ఎలాగో ఓటాగు తెచ్చి ఇస్తాను" అని చెప్పాడు. "ఇప్పుడే అవసరం లేదు.ఆఫీసుకే తెచ్చి ఇవ్వండి" అంటూ

(మిగతా 39వ పేజీలో చూడండి)

## చిత్రోదంతాలు

### ముందు మాట

నవ్వి ఏడ్పించడం, ఏడ్చేవాళ్ళని చూసి నవ్వడం మనసు నొప్పించేవారి మనస్తత్వం. నిత్య కష్టాలే కాదు, నిత్య సుఖాలు కూడా జీవితాన్ని యాంత్రికంగా మార్చివేస్తాయి. విసుగెత్తే జీవితాల్లో చిరునవ్వులనేవి ముళ్ళ తోటల్లో మల్లెల గుబాళింపుల్లాంటివే. తాత్కాలికంగానైనా జీవిత యాంత్రికత నుంచి ధ్యాస మళ్ళించే విషయాల్లో హాస్యమొకటి. సున్నితమైన హాస్యం మొదలు ముదురు హాస్యం వరకూ ఆయా సందర్భాల్నిబట్టి వాటికి తగ్గ స్పందనతో హాయిగానో, గట్టిగానో నవ్వుకొనేటట్లు చేస్తాయి. ఈ హాస్య సృష్టి అనేది సంభాషణల్లో జరగవచ్చు. సన్నివేశాల్లో జరగవచ్చు. సంగీతానికి మల్లే హాస్యోక్తులకీ, ఉదంతాలకీ కాలపరిమితులు లేని నిత్య ప్రచారమూ, కాలానుగుణ్యమైన మార్పులూ అవసరం కాబట్టి పాఠకులనలరించే ప్రయత్నంగా కొన్ని చిత్రమైన కథనాన్ని సేకరించి, కొన్నిటికి మార్పులు చేసి, మరికొన్నిటిని కేవలం కల్పించి 'ప్రియదత్త' ముందుంచుతోంది. చదివి ఆనందించండి.



### నోటి శని

వాక్స్వాతంత్ర్యం లేని కారణంగా ఓ రష్యన్ పౌరుడికి స్టాలిన్ మీద విపరీతమైన కోపం వచ్చి, మాస్కో రెడ్ స్క్వేర్‌లో ఏవేవో పిచ్చి పిచ్చిగా వాగాడు. స్టాలిన్ నరకానికి పోతాడని ఎలుగెత్తి అరిచాడు. స్టాలిన్ నరకానికి పోలేదుగానీ, ఆ పౌరుడు మట్టుకు సైబీరియాలో జైలు కటకటాలు లెక్కించ ప్రారంభించాడు. ఎన్నో సంవత్సరాలు బయటి ప్రపంచంతో సంబంధం లేక జైలు జీవితం లోనే మగ్గిపోయాడు. ఆ లోపుగా ఎన్నో మార్పులు సంభవించాయి. సరళీకృతమైన విధానాలను రూపొందించుకొని, నూతన నాయకత్వంలో రష్యా కొత్త అడుగులు వేయసాగింది. కృశ్చేవ్ జైళ్ళలో మగ్గుతున్న బందీలనందర్నీ విడుదల చేశాడు. ఏం జరిగిందో తెలియని ఆ పౌరుడు బయటకు అడుగు పెట్టానే, ఆనందం పట్టలేక 'స్టాలిన్ చిరంజీవిగా ఉండాలి' అని ఎలుగెత్తి అరిచాడు. వెంటనే అతను తిరిగి జైలు కటకటాలు లెక్కపెట్టవలసి వచ్చింది. రాజు మారినప్పుడల్లా ప్రజల నోర్లు కూడా మారాలి. – ఎలక్ట్రాన్

నా విజిటింగ్ కార్డు ఇచ్చాను. మర్నాడు వచ్చి నా వంద ఇవ్వబోయాడు. నేను తీసుకోలేదు." ఈ వందతో ఎప్పుడైనా నాకు లంచ్ ఇచ్చి నా రుణం తీర్చుకోండి" అని చెప్పాను. అతను నవ్వాడు. ఆ నవ్వుకు నా మనసెంతో ఎగిసి పడింది. ఇలా మొదలైన మా పరిచయం, రోజూ కలుసుకొని గంటల కొద్దీ కబుర్లు చెప్పుకొనేదాకా వెళ్ళింది. ఒకరి మనసు మరొకరం విప్పి చెప్పుకున్నాం. అతనిపట్ల నాలో వున్న ప్రేమను నేనే ముందుగా వ్యక్తపరిచాను. అతను నా ప్రేమను అంగీకరించాడు. ఇద్దరం కలిసి సినిమాలకు, షికార్లకు వెళ్ళేవాళ్ళం. ఓ రోజు ..

"పెళ్ళి చేసుకుందాం" అని అడిగాను.

"నాకు ఫారిన్‌కు వెళ్ళే ఛాన్స్ వచ్చింది. తిరిగి వచ్చాక చేసుకుందాం. ఇట్ ఈజ్ వెరీ రేర్ ఛాన్స్. ప్రస్తుతం నేను పని చేస్తున్న కంపెనీ, ఫారిన్‌లోని ఓ ఫిలిం యాడ్ కంపెనీతో అగ్రిమెంట్ కుదుర్చుకుంది. జాయింట్ వెంచర్. మా కంపెనీ తరపున నన్ను పంపబోతున్నారు. మోడల్స్ కూడా అందరూ అక్కడివాళ్ళే. సిక్స్ మంత్స్ ప్రాజెక్ట్ వర్క్. వర్క్ అయిపోగానే ఇండియా వచ్చేస్తాను. మనం తప్పకుండా పెళ్ళి చేసుకుందాం" అని చెప్పాడు. ఆ తర్వాత అతను నెల రోజులకే ఫారిన్‌కు వెళ్ళిపోయాడు. నేనే ఎయిర్‌పోర్ట్‌కెళ్ళి సెండాఫ్ ఇచ్చాను. ఫారిన్‌కెళ్ళినా రోజూ నాతో మాట్లాడేవాడు. కొన్నాళ్ళ తర్వాత అతను ఫోన్ చేయటం మానేశాడు. వర్క్ బిజీలో వున్నాడేమో అనుకున్నా. మరికొన్ని రోజులు గడిచాయి. అయినా అతన్నుంచి ఫోన్ రాలేదు. అతని సెల్‌కు ఫోన్ చేస్తే, లిఫ్ట్ చేయటం లేదు. ఓ రోజు అతను పని చేస్తున్న కంపెనీకెళ్ళి అతని గురించి అడిగాను. అతను అక్కడ్నుంచి ఫోన్ చేసి ఏం చెప్పాడో, వారు 'సారీ ఇవ్వలేము' అన్నారు. ఎంతగా రిక్వెస్ట్ చేసినా ఇవ్వలేదు. చేసేది లేక వెనక్కు వచ్చేశాను. ఓ వారం తర్వాత నాకో ఇ-మెయిల్ వచ్చింది. అందులో –

"నేను లూసీ అనే అమ్మాయిని పెళ్ళాడబోతున్నాను. నన్ను మన్నించు. నా గురించి మరిచిపో" అని వుంది.

ఈ విషయం తెలిసిన నేను తట్టుకోలేకపోయాను. ఈ ప్రపంచమంతా శూన్యమైపోయినట్టనిపించింది. అతను లేని జీవితాన్ని ఊహించుకుంటేనే ఒక్కసారిగా భయమేసింది. అతనితో కలిసి బ్రతికే అవకాశం కోల్పోయినందుకు జీవితమే వృధా అనిపించింది. నాకు తెలిసిన డాక్టర్ దగ్గరకెళ్ళి, ఆ డాక్టర్‌కు అబద్ధం చెప్పి, నిద్ర మాత్రల్ని ప్రిస్‌క్రిప్షన్‌గా రాయించుకున్నాను. అయిదారు షాపుల్లో ఆ ప్రిస్‌క్రిప్షన్ చూపించి, ఓ వందకు పైగా నిద్ర మాత్రలు పోగుచేసుకొని

**ఆత్మ తృప్తి కథ**

*(31వ పేజీ తరువాయి)*

అపార్ట్‌మెంట్‌కెళ్ళాను. చాలాసేపు ఏడ్చాను. చివరికి తెల్లవారుఝాము వరకూ మేల్కొని ఆలోచించాను.

అతను ఒక విధంగా నన్ను పెళ్ళిచేసుకుంటానని మాట ఇచ్చి మోసం చేశాడు. అయినా ఎందుకో అతనిపై ద్వేషం, కోపం కలగలేదు. అతను నా సొంతం కాలేకపోయాడే అన్న ఫీలింగ్ నన్ను ఎంతగానో కుంగదీసింది. చివరికి చావటమే మేలనిపించి సూసైడ్ నోట్ రాసి నిద్ర మాత్రలు మింగేశాను. మింగుతున్నప్పుడు కాస్త చేతులు ఒణికాయి. దాదాపుగా అన్నీ మింగేశాను. ఒకటో రెండో కిందపడ్డాయి. ఒంగి వాటిని అందుకొనే ఓపిక లేకపోయింది. మంచినీళ్ళు తాగేసి బెడ్‌పై వాలిపోయాను. ఇక అంతే.. మళ్ళీ కళ్ళు తెరిచేసరికి ఇక్కడున్నాను" అంటూ చెప్పటం పూర్తి చేసింది మధులత.

✻ ✻ ✻

ఆ రోజు మధులతను డిస్‌ఛార్జ్ చేసే రోజు. డిస్‌ఛార్జ్ కాబోయేముందు నన్ను అడిగింది మధులత. "అతన్ని మరచిపోవాలంటే ఏం చెయ్యాలి?"

"పెళ్ళి చేస్కో" అన్నాను.

"మరి నువ్వెందుకు చేసుకోలేదు?" అడిగింది మధులత.

నాకేం సమాధానం చెప్పాలో తోచలేదు.

తనే అడిగింది –

"నీకు పెళ్ళి చేసుకోవాలని లేదా?"

"ఆ విషయం గురించి ఒకప్పుడు ఆలోచించాను. ఇప్పుడు ఆ ఆలోచన లేదు. అంతగా ఆరాటం లేదు."

"ఇప్పుడు ఆలోచించు, నా కోసం ఆలోచించు."

కాసేపు మౌనం వహించాను.

"అతనితో తిరిగి శీలం పోగొట్టుకున్నానేమోనని నీ అనుమానమా?" అడిగింది మధులత.

"నీ క్యారెక్టర్ ఏంటో నాకు తెలియదా? అతను నిన్ను కాదని ఇంకో వ్యక్తిని పెళ్ళి చేసుకోబోతున్నా అసహ్యించుకోక, అతన్ని మిస్ అయినందుకు నీలో రేగిన బాధను భరించలేక, ఈ ప్రయత్నానికి పూనుకున్నావంటేనే తెలిసిపోతోంది నీ క్యారెక్టర్ ఎలాంటిదో? నువ్వు ఎదుటివారికి మంచి చేయాలని చూసేదానివేకాని, వంచన చేయాలని చూసేదానివి కావు."

నేను చెప్పింది విన్న తర్వాత అడిగింది మధులత.

"అయితే నీకిష్టమేనా?"

అంగీకారంగా ఆమె కళ్ళలోకి తొంగి చూస్తూ చిన్నగా నవ్వాను.

"థాంక్యూ మై ఫ్రెండ్ " అంటూ నన్ను లతలా అల్లుకుంది మధులత. ఆమె కంటి నుంచి వచ్చిన వెచ్చని కన్నీరు నా భుజాన్ని తడిపింది.

"ఇక నుంచి నీ కంట కన్నీరు రారాదు" అంటూ ఆమె కన్నీరు తుడిచి ఆ గదిలో నుంచి బయటికి నడిపించాను. మనిషి తాను కోరుకున్న వ్యక్తి దగ్గరకన్నా, తనను కోరుకున్న వ్యక్తి దగ్గరే ఎక్కువ ఆనందాన్ని, ఆత్మ తృప్తిని పొందుతారని, మధులత నా జీవితంలోకి ప్రవేశించాక అర్థమయింది. షి ఈజ్ నాట్ ఓన్లీ మై వైఫ్.. మై లైఫ్ ఆల్సో! ❋

